Telugu Bhakti Pages
www.telugubhakti.com

Printer friendly version

Join Telugu Bhakti Pages group to get updates/ to participate in Dharmic discussions and to share thrilling religious views and divine experiences.

Click http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

శ్రీమద్భగవద్గీత

ఓం శ్రీపరమాత్మనే నమః

అథ అష్టాదశోఽధ్యాయః – మోక్షసన్న్యాస యోగః

అర్జున ఉవాచ

1 సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీకేశ పృథక్ కేశినిషూదన ॥

సంన్యాసస్య– మహాబాహో–తత్త్వం– ఇచ్ఛామి–వేదితుం

త్యాగస్య–చ–హృషీకేశ–పృథక్–కేశినషూదన

మహాబాహో= గొప్పబాహువులు గలవాడా, హృషీకేశ=కృష్ణా, కేశినిషూదన= కేశియను రాక్షసుని సంహరించినవాడా, సంన్యాసస్య = సన్యాసము యొక్క, త్యాగస్య చ = త్యాగము యొక్క, తత్త్వం= తత్త్వమును, పృథక్= వేర్వేరుగ, వేదితుం= తెలిసికొనుటకు, ఇచ్ఛామి= కోరుచున్నాను.

అర్జునుడు పలికెను – కృష్ణా! అంతర్యామీ ! వాసుదేవా ! సన్న్యాసతత్త్వ మును, త్యాగతత్త్వమును వేర్వేఱుగా తెలిసికొనగోరుచున్నాను.

శ్రీభగవాన్ ఉవాచ

2 కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః ।

సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥

కామ్యానాం-కర్మణాం-న్యాసం-సంన్యాసం-కవయః-విదుః

సర్వకర్మఫలత్యాగం-ప్రాహుః-త్యాగం-విచక్షణా

కవయః= జ్ఞానులు, కామ్యానాం= కామ్యమైన, కర్మాణాం= కర్మలయొక్క, న్యాసం= విడచుటను, సంన్యాసం= సన్యాసమని, విదుః= తెలిసికొనియున్నారు, విచక్షణాః= వివేకవంతులు, సర్వకర్మఫలత్యాగం= సకల కర్మలయొక్క ఫలమును త్యజించుటకు, త్యాగం= త్యాగము అని, ప్రాహుః= తెలిపిరి.

శ్రీభగవానుడు పలికెను - కామ్యకర్మల త్యాగమునే సన్న్యాసమని కొందఱు పండితులు చెప్పిరి. కాని విచక్షణాశీలురైన మఱికొందరు మాత్రము సర్వకర్మఫలములను త్యజించుటను త్యాగమని అంటారు.

3 త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః ।

యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే ॥

త్యాజ్యం-దోషవత్- ఇతి- ఏకే-కర్మ-ప్రాహుః-మనీషిణః

యజ్ఞదానతపఃకర్మ-న-త్యాజ్యం- ఇతి-చ-అపరే

ఏకే=కొందరు, మనీషిణః= వివేకవంతులు, కర్మ= కర్మను, దోషవత్= దోషమువలెను, త్యాజ్యం ఇతి= విడువదగినదనియు, అపరే= మరికొందరు, యజ్ఞదానతపఃకర్మ = యజ్ఞము, దానము,

కొందరు విద్వాంసులు కర్మలన్నియును దోషయుక్తములే గావున వాటిని త్యజింపవలెనని యందురు. కాని యజ్ఞదాన తపశ్చర్యాది కర్మలు త్యజింపదగవు.

4 నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।

త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తితః ॥

నిశ్చయం–శృణు–మే–తత్ర–త్యాగే–భరతసత్తమ

త్యాగః–హి–పురుషవ్యాఘ్ర–త్రివిధః–సంప్రకీర్తితః

భరతసత్తమ = అర్జునా, తత్ర= ఆ, త్యాగే= త్యాగ విషయమునందు, మే=నా యొక్క, నిశ్చయం= నిర్ణయమును, శృణు= వినుము, పురుషవ్యాఘ్ర = అర్జునా, త్యాగః= త్యాగము, త్రివిధః= మూడు విధములుగ, సంప్రకీర్తితః హి= చెప్పబడుచున్నది.

ఓ పురుషశ్రేష్ఠా! అర్జునా! సన్న్యాసము, త్యాగము అను రెండు విషయములలో మొదట త్యాగమునుగూర్చి నా నిశ్చయమును వినుము. త్యాగము సాత్త్వికము, రాజసము, తామసము అని మూడువిధములుగా ఉన్నాయి.

5 యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।

యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥

యజ్ఞదానతపఃకర్మ–న–త్యాజ్యం–కార్యం– ఏవ–తత్

యజ్ఞః– దానం–తపః–చ– ఏవ–పావనాని–మనీషిణాం

యజ్ఞదానతపఃకర్మ= యజ్ఞము, దానము, తపస్సు యనెడి కర్మ, న త్యాజ్యం= విడువదగినదికాదు, తత్= అది, కార్యం ఏవ =చేయదగినదియే, యజ్ఞః= యజ్ఞము, దానం= దానము, తపః చ ఏవ= తపస్సు, మనీషిణాం= వివేక వంతులకు, పావనాని= పవిత్రతను గలుగజేయును.

యజ్ఞదానతపశ్చర్యాది కర్మలు త్యజింపదగవు, అవి విధిగా ఆచరింపదగినవి. విడు వదగినవికావు.

6 ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ ।

కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్ ॥

ఏతాని-అపి-తు-కర్మాణి-సంగం-త్యక్త్వా-ఫలాని-చ

కర్తవ్యాని- ఇతి-మే-పార్థ-నిశ్చితం-మతం- ఉత్తమం

పార్థ=అర్జునా, ఏతాని= ఈ, కర్మాణి అపి తు=కర్మలను కూడ, సంగం= ఆసక్తిని, ఫలాని చ = ఫలమును, త్యక్త్వా= విడిచి, కర్తవ్యాని ఇతి= చేయదగినపనియని, మే=నాయొక్క, నిశ్చితం= నిర్ణయింపబడిన, ఉత్తమం= ఉత్తమమైన, మతం= అభిప్రాయము.

కావున ఓ పార్థా! ఈ యజ్ఞదాన తపోరూపకర్మలను మరియు కర్తవ్యకర్మలను అన్నింటి ఫలాసక్తులను వదలి, అవశ్యమాచరించవలెను అనునది ఉత్తమమైన నా నిశ్చిత ఉత్తమాభిప్రాయము.

7 నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే ।

మోహాత్ తస్య పరిత్యాగః తామసః పరికీర్తితః ॥

నియతస్య-తు-సంన్యాసః-కర్మణః-న- ఉపపద్యతే

మోహాత్-తస్య-పరిత్యాగః- తామసః-పరికీర్తితః

నియతస్య తు= విధియుక్తమైన, కర్మణః= కర్మయొక్క, సంన్యాసః= సన్యాసమున, న ఉపపద్యతే = తగదు, మోహాత్ = మోహమువలన, తస్య=దానియొక్క, పరిత్యాగః= విడుచుట, తామసః= తమోగుణ సంబంధమైనదియని, పరికీర్తితః= చెప్పబడినది.

శాస్త్రవిహితకర్మలు వదలుట సరిగాదు. కావున మోహవశమున దానిని త్యజించుట తామస త్యాగము అని చెప్పబడుతోంది.

8   దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్ త్యజేత్ ।

స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥

దుఃఖం- ఇతి- ఏవ- యత్- కర్మ- కాయక్లేశభయాత్- త్యజేత్

సః-కృత్వా-రాజసం-త్యాగం-న- ఏవ- త్యాగఫలం-లభేత్

కాయక్లేశభయాత్=శరీరాయాస భీతివలన, దుఃఖం ఇతి ఏవ= శోకదాయకమైనదేయని, యత్ = ఏ, కర్మ= కర్మమును, త్యజేత్= త్యజించుచున్నాడో, సః= వాడు, రాజసం= రజోగుణసంబంధమైన, త్యాగం= త్యాగమును, కృత్వా= ఆచరించి, త్యాగఫలం= త్యాగఫలమును, న లభేత్ ఏవ= పొందనేపొందడు.

కర్మలన్నియును దుఃఖాన్నిచ్చేవే యని భావించి, శారీరికక్లేశమునకు భయపడి, కర్తవ్యకర్మలను త్యజించుటను రాజసత్యాగము అని అంటారు. రాజసత్యాగము చేయువాడు త్యాగ ఫలమును పొందలేడు.

9   కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున ।

సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్త్వికో మతః ॥

కార్యం- ఇతి- ఏవ- యత్-కర్మ-నియతం-క్రియతే-అర్జున

సంగం-త్యక్త్వా-ఫలం-చ- ఏవ-సః-త్యాగః- సాత్త్వికః-మతః

అర్జున= అర్జునా, నియతం= నియమింపబడిన, యత్ = ఏ, కర్మ= కర్మము, కార్యం ఇతి ఏవ= చేయవలసినదియే యని, సంగం= అభిమానమును, ఫలం ఏవ చ= ఫలమును కూడా, త్యక్త్వా = విడిచి, క్రియతే= ఆచరించబడుచున్నదో, సః= అట్టి, త్యాగః= త్యాగము, సాత్త్వికః= సాత్త్వికమైనదియని, మతః= నిర్ణయము.

అర్జునా ! శాస్త్రయుక్తమైన విధులు కర్తవ్యములుగా భావించి వాటియందలి ఫలాసక్తులను త్యజించి, చేయుటయే సాత్త్వికత్యాగము అని చెప్పబడినది.

10 న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।

త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః ॥

న-ద్వేష్టి- అకుశలం-కర్మ-కుశలే-న-అనుషజ్జతే

త్యాగీ-సత్త్వసమావిష్టః-మేధావీ-ఛిన్నసంశయః

సత్త్వ సమావిష్టః= సత్త్వగుణ సమేతుడును, మేధావీ= జ్ఞానవంతుడును, ఛిన్న సంశయః= సంశయరహితుడును, త్యాగీ= త్యాగశీలుడు, అకుశలం= శోకమయమైన, కర్మ = కర్మమును, న ద్వేష్టి= ద్వేషింపడు, కుశలే= సుఖమయ కర్మయందు, న అనుషజ్జతే = ఆసక్తి పొందడు.

కర్మలను ద్వేషింపనివాడు, కుశలకర్మలయందు ఆసక్తి చూపడు, శుద్ధసత్త్వగుణయుక్తుడు, సంశయలేనివాడు, బుద్ధిమంతుడు ఐనవాడు నిజమైన త్యాగి.

11 న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః ।

యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే ॥

న-హి-దేహభృతా-శక్యం-త్యక్తుం-కర్మాణి-అశేషతః

యః-తు-కర్మఫలత్యాగీ-సః-త్యాగీ- ఇతి-అభిధీయతే

దేహభృతా= దేహాభిమానము గలవానికి, అశేషతః= సంపూర్ణముగ, కర్మాణి= కర్మలను, త్యక్తుం= విడుచుటకు, న శక్యం హి= సాధ్యముగాదు, యః తు = ఎవడు, కర్మఫల త్యాగీ= కర్మఫలములను విడుచుచున్నాడో, సః=వాడు, త్యాగీ ఇతి= త్యాగియని, అభిధీయతే= చెప్పబడుచున్నాడు.

ప్రతి శరీరధారికిని కర్మలను సంపూర్ణముగ త్యజించుట సాధ్యముకాదు. కావున కర్మలను గాక కర్మఫలములను త్యజించినవాడే నిజమైన త్యాగి అని చెప్పబడుచున్నాడు.

12 అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।

భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥

అనిష్టం- ఇష్టం-మిశ్రం-చ- త్రివిధం- కర్మణః-ఫలం

భవతి-అత్యాగినాం-ప్రేత్య-న-తు-సంన్యాసినాం-క్వచిత్

అనిష్టం= ఇష్టము కానిదియు, ఇష్టం= ఇష్టమైనదియు, మిశ్రం చ = మిశ్రమమైనదియు, త్రివిధం= మూడు విధములుగ, కర్మణః= కర్మలయొక్క, ఫలం= ఫలము, అత్యాగినాం= త్యాగులుగాని వారలకు, ప్రేత్య= మరణానంతరము, భవతి= కలుగుచున్నది, సంన్యాసినాం తు= సన్యాసులకు, క్వచిత్= ఎప్పుడును, న భవతి= కలుగదు.

కర్మఫలత్యాగము చేయని మనుష్యుల కర్మలకైతే మంచి, చెడు, మిశ్రము అని మూడు విరకములఫలములుండును. మరణానంతరము వారు వాటిని తప్పక అనుభవించవలసి వుండును.కాని కర్మఫలత్యాగమొనర్చినకర్మయోగులు తమ కర్మలఫలములను ఏ కాలమునందైనను, ఏ విధముగను అనుభవింపవలసిన పనికలుగదు.

13 పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।

సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥

పంచ-ఏతాని- మహాబాహో-కారణాని-నిబోధ-మే

సాంఖ్యే-కృతాంతే-ప్రోక్తాని-సిద్ధయే-సర్వకర్మణాం

మహాబాహూ= అర్జునా, సర్వకర్మణాం= సర్వకర్మలయొక్క, సిద్ధయే= సిద్ధి కొరకు, కృ తాంతే= సిద్ధాంతమును తెలుపు, సాంఖ్యే= సాంఖ్యమునందు, ప్రోక్తాని= చెప్పబడిన,

ఏతాని = ఈ, పంచ= అయిదు, కారణాని= కారణములను, మే=నావలన, నిబోధ= తెలిసికొనుము.

అర్జునా ! సర్వకర్మలసిద్ధికి ఐదు కారణములు గలవని కర్మలను అంతముచేయు ఉపాయములను తెలుపు సాంఖ్యశాస్త్రమునందు పేర్కొంది. వాటిని నావలన వినుము.

14 అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।

వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥

అధిష్ఠానం–తథా–కర్తా–కరణం–చ–పృథగ్విధం

వివిధాః–చ–పృథక్–చేష్టాః–దైవం–చ– ఏవ– అత్ర–పంచమం

అధిష్టానం= దేహమును, తథా=అటులనే, కర్తా= కర్తయును, పృథగ్విధం= వివిధములైన, కరణం చ = ఇంద్రియములను, వివిధాః= నానావిధములైన, పృథక్ = వేర్వేరైన, చేష్టాః చ= క్రియలును, అత్ర=వీనియందు, దైవం చ ఏవ= దైవమును, పంచమం= అయిదవ కారణము.

కర్మల సిద్ధియందు అధిష్ఠానము, కర్త, వివిధములైన కరణములు నానావిధ చేష్టలు, దైవము అను ఐదును కారణములు.

15 శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః ।

న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః ॥

శరీరవ్యాఙ్మనోభిః– యత్–కర్మ–ప్రారభతే–నరః

న్యాయ్యం–వా–విపరీతం–వా–పంచ– ఏతే–తస్య–హేతవః

న్యాయ్యం వా= న్యాయబద్ధముగగాని, విపరీతం వా= అన్యాయముగగాని, శరీర వాఙ్మనోభిః= శరీరము, వాక్కు, మనస్సులచేత, యత్ = ఏ, కర్మ = కర్మను, నరః=

నరుడు, ప్రారభతే = ప్రారంభించుచున్నాడో, తస్య= ఆ కర్మమునకు, ఏతే= ఈ , పంచ= అయిదును, హేతవః= కారణములు.

మానవుడు మనో వాక్కాయములచే ఆచరించు శాస్త్రానుకూలమ్మైన లేక విపరీతమ్మైన యేకర్మలైనను ఈ యైదు కారణములై యున్నవి.

16 తత్రైవం సతి కర్తారమ్ ఆత్మానం కేవలం తు యః ।

పశ్యత్యకృతబుద్ధిత్వాత్ న స పశ్యతి దుర్మతిః ॥

తత్ర- ఏవం-సతి-కర్తారం- ఆత్మానం-కేవలం-తు-యః

పశ్యతి-అకృత బుద్ధిత్వాత్-న-సః-పశ్యతి-దుర్మతిః

తత్ర=అందు, ఏవం సతి= ఇలావుండగ, కేవలం= కేవలము, ఆత్మానం తు= ఆత్మనే, కర్తారం= కర్తగను, అకృతబుద్ధిత్వాత్ = అశుద్ధ బుద్ధిగలవాడగుటచేత, యః= ఎవడు, పశ్యతి = గాంచుచున్నాడో, సః= ఆ, దుర్మతిః=అజ్ఞాని, న పశ్యతి= చూడలేకున్నాడు.

అట్లైనప్పటికిని విపరీతబుద్ధికారణమున ఏ మనుష్యుడు కేవలుడు, శుద్ధస్వరూపుడైన ఆత్మను సమస్తకర్మలకు కర్తగా భావించునో, అట్టి మలినబుద్ధిగల అజ్ఞాని సత్యమును తెలుసుకొనలేకున్నాడు.

17 యస్య నాహంకృతో భావో బుద్ధిరస్య న లిప్యతే ।

హత్వాపి స ఇమాన్ లోకాన్ న హంతి న నిబధ్యతే ॥

యస్య-న-అహంకృతః-భావః-బుద్ధిః-యస్య-న-లిప్యతే

హత్వా-అపి-సః- ఇమాన్-లోకాన్-న-హంతి-న-నిబధ్యతే

యస్య= ఎవనికి, అహంకృతః= నేనే కర్తయనెడి, భావః= భావము, న=లేదో, యస్య= ఎవనియొక్క, బుద్ధిః= బుద్ధి, న లిప్యతే= అంటదో, సః=వాడు, ఇమాన్= ఈ, లోకాన్=

ప్రాణులను, హత్వా అపి= వధించినను, న హంతి= చంపినవాడుకాడు, న నిబధ్యతే= బద్ధుడును కాడు.

అంతఃకరణమునందు కర్తృత్వభావము లేనివానిబుద్ధి ప్రాపంచిక విషయములందు, కర్మలయందును అంటుకొనదు. అట్టి పురుషుడు ఈ లోకములను అన్నింటిని హతమార్చినను వాస్తవముగా చంపినవాడు కాడు. అతడు ఎట్టి కర్మలచేత బంధింపబడడు.

18 జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।

కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥

జ్ఞానం–జ్ఞేయం–పరిజ్ఞాతా– త్రివిధా–కర్మచోదనా

కరణం–కర్మ–కర్తా– ఇతి– త్రివిధః– కర్మసంగ్రహః

కర్మచోదనా= కర్మచోదనము, జ్ఞానం= జ్ఞానము, జ్ఞేయం= జ్ఞేయము, పరిజ్ఞాతా= గ్రహించువాడు, ఇతి= అని, త్రివిధా = మూడువిధములు, కర్మసంగ్రహః= కర్మ సంగ్రహము, కరణం= సాధనము, కర్మ= కార్యము, కర్తా= చేయువాడును, ఇతి= అని, త్రివిధః= మూడు విధములు.

జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అనునవి మూడును కర్మప్రవృత్తికి కారణములు. కర్మప్రేరణములు. కర్త, కర్మ, క్రియ అని కర్మసంగ్రహములు మూడును ఆధారములు.

19 జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।

ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి ॥

జ్ఞానం–కర్మ–చ–కర్తా–చ–త్రిధా– ఏవ–గుణభేదతః

ప్రోచ్యతే–గుణసంఖ్యానే–యథావత్–శృణు–తాని–అపి

గుణసంఖ్యానే= సాంఖ్యశాస్త్రమునందు, జ్ఞానం= జ్ఞానమును, కర్మ చ= కర్మమును, కర్తా చ= కర్తయును, గుణభేదతః= గుణభేదము ననుసరించి, త్రిధా ఏవ= మూడు విధములుగనే, ప్రోచ్యతే= చెప్పబడుచున్నది, తాని అపి= వానినికూడా, యథావత్= యథార్థముగ, శృణు= ఆలకింపుము.

గుణములసంఖ్యను వివరించు సాంఖ్యశాస్త్రమునందు జ్ఞానము, కర్మ, కర్త అనునవి గుణభేదములతో మూడేసి విధములుగా చెప్పబడినవి. వానిని గూర్చి వివరించెదను వినుము.

20 సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే ।

అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥

సర్వభూతేషు–యేన– ఏకం–భావం–అవ్యయం– ఈక్షతే

అవిభక్తం–విభక్తేషు–తత్–జ్ఞానం–విద్ధి–సాత్త్వికం

విభక్తేషు=విభక్తములైన, సర్వభూతేషు= సర్వభూతములయందును, అవిభక్తం= విభక్తము గానట్టియు, అవ్యయం = నశించనట్టియు, ఏకం= ఏకమ్మైన, భావం= భావమును, యేన= ఏ జ్ఞానముచేత, ఈక్షతే= గాంచుచున్నాడో, తత్ = ఆ, జ్ఞానం = జ్ఞానము, సాత్త్వికం= సాత్త్విక జ్ఞానమని, విద్ధి=తెలిసికొనుము.

వేర్వేరుగా కన్పించు సమస్త ప్రాణులయందును శాశ్వతుడైన పరమాత్మయే విభాగరహితుడుగా సమభావముతో స్థితుడై యున్నట్లు జ్ఞానియైన వాడు చూచును. అట్టి పురుషుని జ్ఞానమును సాత్త్విక జ్ఞానము అని చెప్పబడుతోంది.

21 పృథక్త్వేన తు యద్జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్ ।

వేత్తి సర్వేషు భూతేషు తద్జ్ఞానం విద్ధి రాజసమ్ ॥

పృథక్త్వేన–తు–యత్–జ్ఞానం–నానాభావాన్–పృథగ్విధాన్

వేత్తి–సర్వేషు–భూతేషు–తత్–జ్ఞానం–విద్ధి–రాజసం

సర్వేషు= సమస్తమైన, భూతేషు= భూతములయందు, పృథగ్విధాన్= వేరు వేరు విధములు గానున్న, నానాభావాన్ = వివిధ భావములు గల వానిని, యత్ = ఏ, జ్ఞానం= జ్ఞానము, పృథక్త్వేన తు = వేర్వేరుగా నుండు వానినిగ, వేత్తి= తెలిసికొనుచున్నాడో, తత్= ఆ, జ్ఞానం= జ్ఞానమును, రాజసం= రాజస జ్ఞానముగ, విద్ధి= తెలిసికొనుము.

సమస్త ప్రాణులయందును నానావిధములైన వివిధ భావములను వేర్వేరుగా భావించువారిజ్ఞానము రాజసము .

22 యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యే సక్తమహైతుకమ్ ।

అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్ ॥

యత్–తు–కృత్స్నవత్– ఏకస్మిన్–కార్యే–సక్తం–అహైతుకం

అతత్త్వార్థవత్–అల్పం–చ–తత్–తామసం– ఉదాహృతం

యత్ తు = ఏదైతే, ఏకస్మిన్= ఏకమైన, కార్యే= కార్యమునందు, కృత్స్నవత్= సంపూర్ణము నందువలె, సక్తం= ఆసక్తమైనదియు, అహైతుకం = హేతువు గానిదియు, అతత్త్వార్థవత్= తత్వార్థరహితమైనదియు, అల్పం చ= స్వల్పమైనదియు, తత్=అది, తామసం= తామస జ్ఞానముగ, ఉదాహృతం= చెప్పబడినది.

ప్రకృతికార్యమైన శరీరమునే సమస్తముగా భావించి, దానియందే ఆసక్తిని కల్గించునట్టిదియు, తాత్త్వికముగా అర్థరహితమైనదియు, హేతుబద్ధము కానిదియు, తుచ్ఛమైనదియు అగు విపరీత జ్ఞానమును తామసము అని చెప్పబడుతోంది.

23 నియతంసంగరహితమ్ అరాగద్వేషతః కృతమ్ ।

అఫలప్రేప్సునా కర్మ యత్తత్ సాత్త్వికముచ్యతే ॥

నియతం–సంగరహితం–అరాగద్వేషతః–కృతం

అఫలప్రేప్సునా–కర్మ–యత్–తత్–సాత్త్వికం– ఉచ్యతే

యత్= ఏ, కర్మ= కర్మము, సంగరహితం= సంగత్వము లేనిదియు, నియతం= నియమిత మైనదియు, అరాగద్వేషతః= రాగద్వేషములు లేకుండునదియు, అఫల ప్రేప్సునా= ఫలాపేక్ష లేనివానిచేత, కృతం= చేయబడినదో, తత్= అది, సాత్త్వికం= సాత్త్వికమని, ఉచ్యతే= చెప్పబడుచున్నది.

కర్తృత్వాభిమానము గాని, ఫలాపేక్షగాని లేని పురుషుని చేత రాగద్వేష రహితముగా చేయబడు శాస్త్రవిహితమైన కర్మ సాత్త్వికకర్మ అనబడుతోంది.

24 యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః ।

క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్ ॥

యత్–తు–కామేప్సునా–కర్మ–సాహంకారేణ–వా–పునః

క్రియతే–బహులాయాసం–తత్–రాజసం– ఉదాహృతం

యత్ = ఏ, కర్మ తు= కర్మము, కామేప్సునా= కోరికలుగలవాని చేత, సాహంకారేణ వా పునః= అహంకారముగల వానిచేత గాని, బహులాయాసం= విశేష ప్రయాసతో, క్రియతే= చేయబడుచున్నదో, తత్= ఆ కర్మము, రాజసం= రాజసకర్మముగ, ఉదాహృతం= చెప్పబడినది.

భోగలాలసుడైన పురుషునిచేతను, అహంకారిచేతను చేయబడుమిక్కిలి ఆయసంతో కూడిన కర్మ రాజసకర్మ అనబడుతోంది.

25 అనుబంధం క్షయం హింసామ్ అనవేక్ష్య చ పౌరుషమ్ ।

మోహాదారభ్యతే కర్మ యత్తత్ తామసముచ్యతే ॥

అనుబంధం–క్షయం–హింసాం–అనవేక్ష్య–చ–పౌరుషం

మోహాత్– ఆరభ్యతే–కర్మ–యత్–తత్–తామసం– ఉచ్యతే

అనుబంధం=పరిణామము, క్షయం= హానియును, హింసాం= హింసయును, పౌరుషం చ = సామర్థ్యమును, అనవేక్ష్య= గ్రహించక, మోహాత్= అవివేకమువలన, యత్ = ఏ, కర్మ= కర్మము, ఆరభ్యతే= ఆరంభింపబడు చున్నదో, తత్ = అది, తామసం= తామస కర్మమని, ఉచ్యతే= చెప్పబడుచున్నది.

పరిణామము హాని, హింస, సామర్థ్యములను చూచుకొనక కేవలము అజ్ఞానముచే మొదలుపెట్టి కర్మలు తామసకర్మలు అని చెప్పబడుచున్నాయి.

26 ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।

సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥

ముక్తసంగః–అనహంవాదీ–ధృత్యుత్సాహ సమన్వితః

సిద్ధ్యసిద్ధ్యోః–నిర్వికారః–కర్తా–సాత్త్వికః– ఉచ్యతే

ముక్తసంగః= సంగత్వమునుండి విడివడినవాడు, అనహంవాదీ= అహంకార రహితుడు, ధృత్యుత్సాహ సమన్వితః= ధైర్యముతోను ఉత్సాహముతోను గూడినవాడు, సిద్ధ్యసిద్ధ్యోః= కార్యముసిద్ధించినను సిద్ధించక పోయినను, నిర్వికారః= వికారము చెందనివాడు నగు, కర్తా= కర్త, సాత్త్వికః= సత్త్వగుణము గలవాడుగ, ఉచ్యతే= చెప్పబడుచున్నాడు.

ఆసక్తిని త్యజించినవాడు, అహంకారరహితముగా మాట్లాడువాడు, ధైర్యోత్సాహములుగలవాడును సిద్ధి – అసిద్ధుల యెడ హర్షశోకాదివికారములకు లోనుకానివాడును అగు పురుషుడు సాత్త్వికకర్త యని చెప్పబడుచున్నాడు.

27 రాగీ కర్మఫలప్రేప్సుః లుబ్ధో హింసాత్మకోఽశుచిః ।

హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥

రాగీ–కర్మఫలప్రేప్సుః–లుబ్ధః–హింసాత్మకః– అశుచిః

హర్షశోకాన్వితః–కర్తా–రాజసః–పరికీర్తితః

రాగీ=అనురాగము గలవాడు, కర్మఫలప్రేప్సుః= కర్మఫలము నాశించెడివాడు, లుబ్ధః= లుబ్ధుడును, హింసాత్మకః= హింసా స్వభావము గలవాడు, అశుచిః= శుచిత్వము లేనివాడు, హర్షశోకాన్వితః= హర్షశోకములతో గూడినవాడునగు, కర్తా = కర్త, రాజసః= రాజసుడని, పరికీర్తితః= చెప్పబడినాడు.

ఆసక్తియుతుడు, కర్మఫలములకై ఆరాటపడువాడు, లోభి, ఇతరులను కష్టపెట్టు స్వభావము గలవాడు, అపవిత్ర ప్రవర్తన గలవాడు, హర్ష శోకములకు లోనగువాడు రాజసకర్త అని చెప్పబడ్డాడు.

28 అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః ।

విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥

అయుక్తః–ప్రాకృతః–స్తబ్ధః–శఠః–నైష్కృతికః–అలసః

విషాదీ–దీర్ఘసూత్రీ–చ–కర్తా–తామసః– ఉచ్యతే

అయుక్తః=యుక్తుడు కానివాడు, ప్రాకృతః= పామరుడు, స్తబ్ధః= జడుడు, శఠః=వంచకుడు, నైష్కృతికః= ఇతరులను మోసగించి నష్టపరచువాడు, అలసః=సోమరియు, విషాదీ= దుఃఖ స్వభావము గలవాడు, దీర్ఘసూత్రీ చ = కాలయాపన చేయువాడు నగు, కర్తా=కర్త, తామసః= తామసుడని, ఉచ్యతే= చెప్పబడుచున్నాడు.

జితేంద్రియుడు కానివాడు, సుశిక్షితుడు కానివాడు, మూర్ఖుడు మొండివాడు, ధూర్తుడు, అకారణముగ ఇతరులవృత్తులకు విఘాతము కల్గించువాడు, సదా

చింతాగ్రస్తుడు, సోమరి, కార్యాచరణమునందు ఉపేక్షతో కాలము గడుపుచుండువాడు అను (దీర్ఘసూత్రి) - లక్షణములను గలవాడు తామసకర్త అని చెప్పబడ్డాడు.

29 బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు ।

ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥

బుద్ధేః-భేదం-ధృతేః-చ- ఏవ-గుణతః-త్రివిధం-శృణు

ప్రోచ్యమానం-అశేషేణ-పృథక్త్వేన-ధనంజయ

ధనంజయ= అర్జునా, గుణతః= గుణములనుబట్టి, బుద్ధేః= బుద్ధియొక్కయు, ధృతేః చ ఏవ= ధైర్యము యొక్కయు, పృథక్త్వేన= వేరువేరుగా, అశేషేణ= సంపూర్ణముగ, ప్రోచ్యమానం=చెప్పబడుచున్న, త్రివిధం= మూడువిధములైన, భేదం= భేదమును, శృ ణు= వినుము.

ఓ ధనంజయా ! ఇప్పుడు నీవు బుద్ధి, ధృతులను గూడ గుణభేదముల ననుసరించి మూడు విధములుగా, విభాగ పూర్వకముగా ఆ విషయము వినుము.

30 ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।

బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ ॥

ప్రవృత్తిం-చ-నివృత్తిం-చ-కార్యాకార్యే-భయాభయే

బంధం-మోక్షం-చ-యా-వేత్తి-బుద్ధిః-సా-పార్థ-సాత్త్వికీ

పార్థ= అర్జునా, యా= ఏ, బుద్ధిః= బుద్ధి, ప్రవృత్తిం చ= ప్రవృత్తి విషయమును, నివృ త్తిం చ= నివృత్తివిషయమును, కార్యా కార్యే= కార్యమును, అకార్యమును, భయాభయే= భయమును అభయమును, బంధం= బంధమును, మోక్షం చ= మోక్షమును, వేత్తి= గ్రహించుచున్నదో, సా= ఆ, బుద్ధిః= బుద్ధి, సాత్త్వికీ= సాత్త్వికమైనది.

ప్రవృత్తిమార్గమును, నివృత్తిమార్గమును, కర్తవ్యమును, అకర్తవ్యమును, భయమును, అభయమును, అట్లే బంధమును, మోక్షమును యథార్థముగా తెలిసికొను బుద్ధి సాత్త్వికమైనది.

31 యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్యమేవ చ ।

అయథావత్ ప్రజానాతి బుద్ధిః సా పార్థ రాజసీ ॥

యయా-ధర్మం-అధర్మం-చ-కార్యం-చ-అకార్యం- ఏవ-చ

అయథావత్- ప్రజానాతి-బుద్ధిః-సా-పార్థ-రాజసీ

పార్థ=అర్జునా, యయా= ఏ బుద్ధిచేత, ధర్మం= ధర్మమును, అధర్మం= అధర్మమును, కార్యం చ= కార్యమును, అకార్యం ఏవ చ = అకార్యమును, అయథావత్= యథార్థము కానట్లు, ప్రజానాతి= తెలిసికొనుచున్నదో, సా= ఆ, బుద్ధిః= బుద్ధి, రాజసీ= రాజసికమైనది.

ఓ పార్థా! ధర్మాధర్మములయొక్కయు, కార్యాకార్యముల యొక్కయు , యథార్థ తత్త్వములను తెలియజాలని బుద్ధి రాజసబుద్ధి యనబడుతోంది.

32 అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా ।

సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధిః సా పార్థ తామసీ ॥

అధర్మం-ధర్మం- ఇతి-యా-మన్యతే-తమసా- ఆవృతా

సర్వార్థాన్-విపరీతాన్-చ-బుద్ధిః-సా-పార్థ-తామసీ

పార్థ= అర్జునా, యా= ఏ, బుద్ధిః= బుద్ధి, తమసా= అజ్ఞానముచేత, ఆవృతా= ఆవరింపబడినదియై, అధర్మం= అధర్మమును, ధర్మం ఇతి= ధర్మమనియు, సర్వార్థాన్= సర్వవిషయములను, విపరీతాన్ చ= విపరీతభావము గలవానినిగను, మన్యతే= తలంచుచున్నదో, సా బుద్ధిః= ఆ బుద్ధి, తామసీ= తామసికమైనది.

ఓ అర్జునా! తమోగుణావృతమైనందున అధర్మమును ధర్మముగను, అట్లే ఇతర విషయములను తద్విపరీతముగను భావించు బుద్ధిని తామస బుద్ధి అంటారు.

33 ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియక్రియాః ।

యోగేనావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ ॥

ధృత్యా-యయా-ధారయతే-మనః-ప్రాణేంద్రియక్రియాః

యోగేన-అవ్యభిచారిణ్యా-ధృతిః-సా-పార్థ-సాత్త్వికీ

పార్థ= అర్జునా, యయా= ఏ, ధృత్యా= ధృతిచేతను, మనః ప్రాణేంద్రియక్రియాః= మనస్సు, ప్రాణము, ఇంద్రియముల చేష్టలు, అవ్యభిచారిణ్యా= చెదరనటువంటి, యోగేన = యోగముచేత, ధారయతే= ధరింపబడుచున్నవో, సా= ఆ, ధృతిః= ధైర్యము, సాత్త్వికీ= సత్త్వగుణ ప్రధానమైనది.

అర్జునా! ఇటునటు చలింపని ధారణాశక్తితో మనుష్యుడు ధ్యానయోగము ద్వారా మనఃప్రాణేంద్రియ క్రియలను ధారణచేయు శక్తిని సాత్త్వికధృతి అంటారు.

34 యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున ।

ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతిః సా పార్థ రాజసీ ॥

యయా-తు-ధర్మకామార్థాన్-ధృత్యా-ధారయతే-అర్జున

ప్రసంగేన-ఫలాకాంక్షీ-ధృతిః-సా-పార్థ-రాజసీ

పార్థ=అర్జునా, అర్జున= అర్జునా, యయా= ఏ, ధృత్వా తు= ధృతిచేతను, ఫలాకాంక్షీ= ఫలమునాశించువాడు, ప్రసంగేన= కోరికతో, ధర్మకామార్థాన్= ధర్మకామములను, ధారయతే= ధరించు చున్నాడో, సా= ఆ, ధృతిః= ధృతి, రాజసీ= రాజసికమైనది.

కాని, ఓపార్థా! అర్జునా! కర్మఫలేచ్ఛగల మనుజుడు మిక్కిలి ఆసక్తితో ధర్మార్థకామవిషయములను ధారణచేయు శక్తిని రాజసధృతి అంటారు.

35 యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।

న విముంచతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ ॥

యయా–స్వప్నం–భయం–శోకం–విషాదం–మదం– ఏవ–చ

న–విముంచతి–దుర్మేధాః–ధృతిః–సా–పార్థ–తామసీ

పార్థ=అర్జునా, దుర్మేధాః= దుర్బుద్ధిగలవాడు, యయా= దేనిచే, స్వప్నం= స్వప్నమును, భయం= భయమును, శోకం= శోకమును, విషాదం= విషాదమును, మదం ఏవ చ= మదమును, న విముంచతి = విడువకున్నాడో, సా= ఆ, ధృతిః= ధృతి, తామసీ= తామసికమైనది.

అర్జునా! నిద్ర, భయము, చింతాశోకములు, విడువక, దుర్మతియైన మనుష్యుడు వాటినే సంతతము ధారణ చేయు చుండును. అటి ధృతిని, తామసధృతి అటారు.

36 సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।

అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి ॥

సుఖం –తు– ఇదానీం–త్రివిధం–శృణు–మే–భరతర్షభ

భ్యాసాత్–రమతే–యత్ర–దుఃఖాంతం–చ–నిగచ్ఛతి

భరతర్షభ=అర్జునా, యత్ర= ఎచ్చట, అభ్యాసాత్=అభ్యాసమువలన, రమతే= రమించు చున్నాడో, దుఃఖాంతం చ = దుఃఖనాశమును కూడ, నిగచ్ఛతి= పొందుచున్నాడో, మే= నాచేత, ఇదానీం= ఇప్పుడు, త్రివిధం= మూడు విధములైన, సుఖం తు= సుఖమును, శృణు= వినుము.

ఓ భరతశ్రేష్ఠా! మూడు విధములగు సుఖములను గూర్చియు నేను చెప్పెదను వినుము. ఏ సుఖమునందు సాధకుడు భజనధ్యానసేవాదుల నొనర్చి ఆనందించునో, దుఃఖములను అతిక్రమించునో. . .

37 యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్ ।

తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమ్ ఆత్మబుద్ధిప్రసాదజమ్ ॥

యత్-తత్-అగ్రే-విషం- ఇవ-పరిణామే-అమృతోపమం

తత్-సుఖం-సాత్త్వికం-ప్రోక్తం- ఆత్మబుద్ధిప్రసాదజం

యత్ తత్ = ఏది, అగ్రే= ప్రారంభమున, విషం ఇవ= విషమువలెను, పరిణామే= అంతమునందు, అమృతోపమం= అమృతమును బోలినదియునై, ఆత్మబుద్ధిప్రసాదజం= తనయొక్క బుద్ధిప్రసన్నత కల్పించుచున్నదో, తత్= ఆ, సుఖం= సుఖము, సాత్త్వికం= సాత్త్వికమని, ప్రోక్తం= చెప్పబడినది.

ప్రారంభమునందు విషతుల్యముగా గోచరించినప్పటికిని పరిణామమున అమృతతుల్యమై పరమాత్మకు సంబంధించిన విషయములలో నిమగ్నమగునో, అట్టి సుఖమును సాత్త్విక సుఖము అంటారు.

38 విషయేంద్రియసంయోగాత్ యత్తదగ్రేఽమృతోపమమ్ ।

పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥

విషయేంద్రియ సంయోగాత్-యత్-తత్-అగ్రే-అమృతోపమం

పరిణామే-విషయం- ఇవ- తత్-సుఖం-రాజసం-స్మృతం

యత్ తత్= ఏది, విషయేంద్రియ సంయోగాత్= విషయేంద్రియసంయోగము వలన, అగ్రే = ఆరంభమున, అమృతోపమం= అమృత తుల్యముగను, పరిణామే=

అనంతరము, విషం ఇవ= విషము వలెను, తత్ = ఆ, సుఖం= సుఖము, రాజసం= రాజసికమ్మైనదిగ, స్మృతం= చెప్పబడినది.

విషయేంద్రియసంయోగమువలన కలుగు సుఖము మొదట భోగానుభవ సమయమునందు అమృతతుల్యముగ అనిపించినను పరిణామమున అది విషతుల్యమగును. అట్టి సుఖమును రాజససుఖము అంటారు.

39 యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః ।

నిద్రాలస్య ప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥

యత్-అగ్రే-చ-అనుబంధే-చ-సుఖం-మోహనం- ఆత్మనః

నిద్రాలస్య ప్రమాదోత్థం-తత్-తామసం- ఉదాహృతం

యత్ = ఏది, అగ్రే చ = ఆరంభమునందు, అనుబంధే చ= అంతమునందును, ఆత్మనః= తనకు, మోహనం= మోహమును, గలుగజేయునదియు, నిద్రాలస్యప్రమాదోత్థం= నిద్ర, అలసత్వము, ప్రమాదము వీటివలన జనించినదియ్యైన, తత్= ఆ, సుఖం= సుఖము, తామసం= తామసమని, ఉదాహృతం= చెప్పబడినది.

నిద్ర, సోమరితనము, మోహముల వలన ఉత్పన్నమగు సుఖమును తామససుఖము అనబడుచున్నది. ఇట్టి సుఖము భోగసమయము నందును, పరిణామమునందును ఆత్మను మోహింపజేస్తుంది.

40 న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।

సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిః స్యాత్ త్రిభిర్గుణైః ।।

న-తత్-అస్తి-పృథివ్యాం-వా-దివి-దేవేషు-వా-పునః

సత్త్వం-ప్రకృతిజైః-ముక్తం-యత్- ఏభిః-స్యాత్-త్రిభిః-గుణైః

ప్రకృతిజైః= ప్రకృతివలన జనించిన, ఏభిః= ఈ, త్రిభిః= మూడైన, గుణైః= గుణముల చేత, ముక్తం=విడువబడిన, సత్త్వం= సత్త్వము, యత్= ఏది, స్యాత్= కలదో, తత్= అది, పృథివ్యాం వా= భూలోకమునందుగాని, దివి= స్వర్గలోకమునందుగాని, పునః= మరల, దేవేషు వా= దేవతలయందుగాని, న అస్తి = లేదు.

పృథివియందు గాని, ఆకాశమునందుగాని, దేవతలయందుగాని, మఱేయితర లోకములయందుగాని, ప్రకృతినుండి ఉత్పన్నములైన ఈ మూడు గుణములు లేకుండ ఏ ప్రాణియు కనబడదు.

41 బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప ।

కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥

బ్రాహ్మణ–క్షత్రియవిశాం–శూద్రాణాం–చ–పరంతప

కర్మాణి–ప్రవిభక్తాని–స్వభావ–ప్రభవైః–గుణైః

పరంతప=అర్జునా, బ్రాహ్మణక్షత్రియవిశాం= బ్రాహ్మణక్షత్రియ వైశ్యులకు, శూద్రాణాం చ = శూద్రులకును, స్వభావ ప్రభవైః= స్వభావముచే గలిగిన, గుణైః= గుణముల చేత, కర్మాణి= కర్మములు, ప్రవిభక్తాని= వేర్వేరుగ విభజింపబడినవి.

ఓ పరంతపా ! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల కర్మలును, శూద్రుల కర్మలును వారివారి స్వాభావికములైన గుణములనుబట్టి ప్రత్యేకించబడ్డాయి.

42 శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ ।

జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రాహ్మంకర్మస్వభావజమ్ ॥

శమః–దమః–తపః–శౌచం–క్షాంతిః– ఆర్జవం– ఏవ–చ

జ్ఞానం–విజ్ఞానం– ఆస్తిక్యం–బ్రహ్మకర్మ– స్వభావజం

శమః= అంతఃకరణ నిగ్రహము, దమః= ఇంద్రియ నిగ్రహము, తపః=తపస్సు, శౌచం= శుచిత్వము, క్షాంతిః= సహనము, ఆర్జవం ఏవ చ = ఋజుత్వము, జ్ఞానం= శాస్త్రవిషయక జ్ఞానము, విజ్ఞానం= అనుభవ జ్ఞానము, ఆస్తిక్యం= ఆస్తిక బుద్ధి, స్వభావజం= స్వభావము వలన కలిగిన, బ్రహ్మకర్మ= బ్రాహ్మణుల కర్మము.

అంతఃకరణనిగ్రహము ఇంద్రియములను వశమునందుంచుకొనుట, ధర్మములను పాటించుటలో ఎదురగు కష్టములను సహించుట, బాహ్యాభ్యంతరముల శుచిత్వము, ఇతరుల అపరాధములను క్షమించుట, మనశ్శరీరేంద్రియముల సరళత్వము వేదశాస్త్రములయందును ఈశ్వరునియం దును పరలోకాదులయందును, విశ్వాసమును కలిగియుండుట, వేదశాస్త్రముల అధ్యయనము, అధ్యాపనము, పరతత్త్వానుభవము – ఇవి యన్నియును బ్రాహ్మణుల నియమిత కర్మమైయున్నది.

43 శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।

దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥

శౌర్యం–తేజః–ధృతిః–దాక్ష్యం–యుద్ధే–చ–అపి–అపలాయనం

దానం– ఈశ్వరభావః–చ–క్షాత్రం–కర్మ–స్వభావజం

శౌర్యం=శౌర్యము, తేజః=తేజస్సు, ధృతిః= ధీరత్వము, దాక్ష్యం= దక్షత్వము, యుద్ధే= యుద్ధమునందు, అపలాయనం అపి చ= పారిపోకుండుట, దానం=దానగుణము, ఈశ్వరభావః చ= స్వామి భావము, స్వభావజం= స్వభావ సిద్ధమైన, క్షాత్రం= క్షత్రియ నియమితమైన, కర్మ= కర్మము.

శౌర్యము, తేజస్సు, ధైర్యము, దక్షత, యుద్ధమునందు వెన్నుచూప కుండుట, దానములనిచ్చుట, స్వామిభావముతో ప్రజలను ధర్మపరాయ ణులనుగా చేయుచు పరిపాలించుట మొదలగునవి యన్నియును క్షత్రియులకు నియమితమైన కర్మము.

44 కృషిగౌరక్ష్యవాణిజ్యం వైశ్యంకర్మస్వభావజమ్ ।

పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥

కృషిగౌరక్ష్య వాణిజ్యం–వైశ్యకర్మ–స్వభావజం

పరిచర్యాత్మకం–కర్మ–శూద్రస్య–అపి–స్వభావజం

కృషిగౌరక్ష్య వాణిజ్యం=వ్యవసాయం, పశుపాలనము, వ్యాపారము, స్వభావజం= స్వభావ జనితమైన, వైశ్యకర్మ= వైశ్యోచితమైన కర్మము, శూద్రస్య అపి= శూద్రునకును, పరిచర్యాత్మకం= పరిచర్య రూపమైన, కర్మ= కర్మము, స్వభావజం= స్వభావసిద్ధమైనది.

వ్యవసాయము, గోరక్షణము, క్రయవిక్రయరూప సత్యవ్యవహారము ఇవి యన్నియును వైశ్యులస్వాభావిక కర్మలు, అట్లే అన్ని వర్ణములవారిని సేవించుట శూద్రునకు స్వభావమైన కర్మయై యున్నది.

45 స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।

స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥

స్వే–స్వే–కర్మణి–అభిరతః–సంసిద్ధిం–లభతే–నరః

స్వకర్మనిరతః–సిద్ధిం–యథా–విందతి–తత్–శృణు

నరః=నరుడు, స్వే స్వే = తమతమ, కర్మణి= కర్మమునందు, అభిరతః= శ్రద్ధగలవాడై, సంసిద్ధిం= సిద్ధిని, లభతే= పొందుచున్నాడు, స్వకర్మనిరతః= తన కర్మమందు నిరతుడైనవాడు, సిద్ధిం= సిద్ధిని, యథా= ఎటుల, విందతి= పొందుచున్నాడో, తత్= దానిని, శృణు= వినుము.

మనుజుడు తనదియైన కర్మమునందు పరమసిద్ధిని నిస్సందేహముగా పొందుదురు. స్వకర్మనిరతులైన మానవులు పరమసిద్ధిని పొందుటకు ఆచరింపవలసిన విధులను తెలుపుచున్నాను.

46 యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।

స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥

యతః–ప్రవృత్తిః–భూతానాం–యేన–సర్వం– ఇదం–తతం

స్వకర్మణా–తం–అభ్యర్చ్య–సిద్ధిం–విందతి–మానవః

భూతానాం= ప్రాణులయొక్క, ప్రవృత్తిః= ఉత్పత్త్యాదులు, యతః= ఎవనివలన కలిగినవో, యేన= ఎవనిచేత, ఇదం= ఈ, సర్వం= సర్వమును, తతం= వ్యాపింపబడి యున్నదో, తం= వానిని, మానవః= మానవుడు, స్వకర్మణా= తన కర్మచేతను, అభ్యర్చ్య= ఆరాధించి, సిద్ధిం= సిద్ధిని, విందతి= పొందుచున్నాడు.

సమస్త ప్రాణుల పుట్టుక పరమేశ్వరునినుండియే జరిగినది. సమస్త జగత్తు నందును అతడు వ్యాపించియున్నాడు. అట్టి పరమేశ్వరుని తన స్వాభావికకర్మల ద్వారా పూజించి, మానవుడు సిద్ధిని పొందుచున్నాడు.

47 శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।

స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥

శ్రేయాన్–స్వధర్మః–విగుణః–పరధర్మాత్–స్వనుష్ఠితాత్

స్వభావ నియతం–కర్మ–కుర్వన్–న– ఆప్నోతి–కిల్బిషం

స్వధర్మః=స్వధర్మము, విగుణః= గుణ హీనమైనను, స్వనుష్ఠితాత్= చక్కగా ఆచరించబడిన, పరధర్మాత్= పరధర్మము కంటెను, శ్రేయాన్= శ్రేయస్కరము, స్వభావ నియతం= స్వభావసిద్ధమైన, కర్మ= కర్మమును, కుర్వన్= చేయువాడు, కిల్బిషం= పాపమును, న ఆప్నోతి= పొందడు.

బాగుగా ఆచరింపబడిన పరధర్మముకంటెను గుణరహితమైన స్వధర్మాచరణమే శ్రేష్ఠమైనది. స్వభావమును అనుసరించి కర్మలను ఆచరించు మనుజుడు ఎట్టి పాపము నొందడు.

48 సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్ ।

సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః ॥

సహజం–కర్మ–కౌంతేయ–సదోషం–అపి–న–త్యజేత్

సర్వారంభాః–హి–దోషేణ–ధూమేన–అగ్నిః– ఇవ– ఆవృతాః

కౌంతేయ= అర్జునా, సహజం=సహజమైన, కర్మ= కర్మము, సదోషం అపి= దోషయుతమైనను, న త్యజేత్= విడువరాదు, అగ్నిః= అగ్ని, ధూమేన ఇవ= పొగచేతను వలె, సర్వారంభాః= సకలకర్మలును, దోషేణ= దోషముచేతను, ఆవృతాః హి= ఆవరింపబడియున్నవి గదా !

అర్జునా ! దోషయుక్తమైనను సహజమైన కర్మను వీడరాదు. అగ్ని పొగచే కమ్మబడినట్లు కర్మలన్నియును ఏదేని ఒక దోషముతో కూడియే యుండును.

49 అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।

నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి ॥

అసక్తబుద్ధిః–సర్వత్ర–జితాత్మా–విగతస్పృహః

నైష్కర్మ్యసిద్ధిం–పరమాం–సంన్యాసేన–అధిగచ్ఛతి

సర్వత్ర= సర్వవిషయములందును, అసక్తబుద్ధిః= ఆసక్తిలేనివాడై, జితాత్మా= మనస్సున జయించినవాడై, విగతస్పృహః= కోరికలు లేనివాడై, సంన్యాసేన= సన్యాసముచేత, పరమాం= ఉత్తమమైన, నైష్కర్మ్యసిద్ధిం= నిష్కామకర్మ సిద్ధిని, అధిగచ్ఛతి= పొందుచున్నాడు.

ఓ అర్జునా! ప్రాపంచిక పదార్థములందు ఆసక్తి లేనివాడును, స్పృహారహితుడును, అంతఃకరణమును జయించిన వాడును అగు పురుషుడు సాంఖ్యయోగము ద్వారా పరమశ్రేష్ఠమైన నైష్కర్మ్యసిద్ధిని పొందుచున్నాడు.

50 సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే।

సమాసేనైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ।

సిద్ధిం–ప్రాప్తః–యథా–బ్రహ్మ–తథా– ఆప్నోతి–నిబోధ–మే

సమాసేన– ఏవ–కౌంతేయ–నిష్ఠా–జ్ఞానస్య–యా–పరా

కౌంతేయ= అర్జునా, సిద్ధిం= సిద్ధిని, ప్రాప్తః= పొందినవాడు, యథా= ఎటుల, బ్రహ్మ= బ్రహ్మమును, ఆప్నోతి= పొందుచున్నాడో, తథా=అటులనే, జ్ఞానస్య= జ్ఞానముయొక్క, పరా= ఉత్తమమైన, నిష్ఠా = నిష్ఠ, యా = ఏదియో, సమాసేన ఏవ = సంక్షిప్తముగా, మే=నా వలన, నిబోధ= తెలిసికొనుము.

అర్జునా! జ్ఞానయోగము యొక్క పరానిష్ఠయైన నైష్కర్మ్య సిద్ధిని పొందు విధమును, తద్ద్వారా మనుష్యుడు బ్రహ్మప్రాప్తి నందు రీతిని సంగ్రహముగా వినుము.

51 బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ।

శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥

బుద్ధ్యా–విశుద్ధయా–యుక్తః–ధృత్యా– ఆత్మానం–నియమ్య–చ

శబ్దాదీన్–విషయాన్–త్యక్త్వా–రాగద్వేషౌ–వ్యుదస్య–చ

విశుద్ధయా= విశుద్ధమైన, బుద్ధ్యా= బుద్ధితో, యుక్తః= కూడినవాడును, ధృత్యా= ధైర్యముతో, ఆత్మానం= తనను, నియమ్య చ = నియమించియును, శబ్దాదీన్= శబ్దాదులైన, విషయాన్= విషయములను, త్యక్త్వా= విడచి, రాగద్వేషౌ= రాగద్వేషములను, వ్యుదస్య చ= విడచి.

విశుద్ధమైన బుద్ధితో, ధైర్యముతో ఆత్మనిగ్రహముతో శబ్దాది విషయములను విడచి, రాగద్వేషాదులకు అతీతంగా...........

52 వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।

ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥

వివిక్తసేవీ-లఘ్వాశీ-యతవాక్కాయమానసః

ధ్యానయోగపరః-నిత్యం-వైరాగ్యం-సముపాశ్రితః

వివిక్తసేవీ= ఏకాంతవాసియు, లఘ్వాశీ= మితాహారియు, యతవాక్కాయ మానసః= స్వాధీనమైన మనోవాక్కాయములు కలవాడు, నిత్యం= ఎల్లప్పుడు, ధ్యానయోగపరః= ధ్యానయోగ పరాయణుడై యుండువాడు, వైరాగ్యం= వైరాగ్యమును, నముపాశ్రితః= చక్కగా ఆశ్రయించినవాడు.

పరిశుభ్రమైన ప్రదేశమున ఏకాంతముగా నివసించువాడు, సాత్త్వికధారణా శక్తిద్వారా అంతఃకరణేంద్రియముల సంయమము కలిగి, మనోవాక్కాయ ములను అదుపులో ఉంచుకొనినవాడు, రాగద్వేషములను అన్ని వేళలా త్యజించి, దృఢమైన వైరాగ్యమును సంపూర్ణముగా ఆశ్రయించినవాడు.

53 అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।

విముచ్య నిర్మమః శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥

అహంకారం-బలం-దర్పం-కామం-క్రోధం-పరిగ్రహం

విముచ్య-నిర్మమః-శాంతః-బ్రహ్మభూయాయ-కల్పతే

అహంకారం= అహంకారమును, బలం= బలమును, దర్పం= దర్పమును, కామం=కామమును, క్రోధం=క్రోధమును, పరిగ్రహం= సంగ్రహమును, విముచ్య=

విడచి, నిర్మమః= మమకార రహితుడు, శాంతః= శాంతుడు, బ్రహ్మభూయాయ= బ్రహ్మత్వమును పొందుటకు, కల్పతే= కల్పింపబడు చున్నాడు.

అహంకారమును, బలమును దర్పమును, కామక్రోధములను, పరిగ్రహమును వదలి, ఎల్లప్పుడు ధ్యానయోగ పరాయణుడై యుండువాడు, మమతా రహితుడు, శాంతియుతుడు ఐన పురుషుడు పరబ్రహ్మమునందు అభిన్నభావముతో స్థితుడగుటకు సమర్థుడగుచున్నాడు.

54 బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।

సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥

బ్రహ్మభూతః-ప్రసన్నాత్మా-న-శోచతి-న-కాంక్షతి

సమః-సర్వేషు-భూతేషు-మద్భక్తిం-లభతే-పరాం

బ్రహ్మభూతః=బ్రహ్మభావమును పొందినవాడు, ప్రసన్నాత్మా=ప్రసన్నచిత్తుడైనవాడు, న శోచతి= దుఃఖించడు, న కాంక్షతి= ఆశించడు, సర్వేషు= సమస్త , భూతేషు= ప్రాణుల యందును, సమః= సమబుద్ధికలిగి, పరాం= ఉత్తమమైన, మద్భక్తిం= నా భక్తిని, లభతే= పొందుచున్నాడు.

పరబ్రహ్మయందు ఏకీభావస్థితుడై ప్రసన్నమనస్కుడైన యోగి దేనికిని శోకింపడు, దేనినీ కాంక్షింపడు. సమస్తప్రాణులయందును సమభావము గల అట్టి యోగి నా పరాభక్తిని పొందుచున్నాడు.

55 భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః ।

తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ ॥

భక్త్యా-మాం-అభిజానాతి-యావాన్-యః-చ-అస్మి-తత్త్వతః

తతః-మాం-తత్త్వతః-జ్ఞాత్వా-విశతే-తదనంతరం

భక్త్యా= భక్తిచేతను, మాం=నన్ను, తత్త్వతః= యథార్థముగ, యావాన్= ఎంతటి ప్రభావము గలవాడనో, యః చ అస్మి= ఎట్టివాడనయితినో, అభిజానాతి= గ్రహించు చున్నాడు, తతః= ఆ తరువాత, మాం=నన్ను, తత్త్వతః= యథార్థముగ, జ్ఞాత్వా= తెలిసికొని, తదనంతరం= అటుపిమ్మట, విశతే=ప్రశ్నించుచున్నాడు.

బ్రహ్మభూతుడైనయోగి ఈ పరాభక్తిద్వారా నేనెవరినో ? ఎంతటి వాడనో? యథాతథముగ నా తత్త్వమును తెలిసికొనును. అట్లు భక్తితో నా తత్త్వమును గ్రహించిన వెంటనే అతడు నా యందే లీనమగుచున్నాడు.

56 సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।

మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥

సర్వకర్మాణి–అపి–సదా–కుర్వాణః–మద్వ్యపాశ్రయః

మత్ప్రసాదాత్–అవాప్నోతి–శాశ్వతం–పదం–అవ్యయం

సర్వకర్మాణి= సర్వకర్మలను, సదా= ఎల్లప్పుడును, కుర్వాణః అపి= చేయుచున్న వాడైనను, మద్వ్యపాశ్రయః= నన్నే శరణు పొందినవాడు, మత్ప్రసాదాత్= నా అనుగ్రహము వలన, అవ్యయం= నాశరహితమ్మైన, శాశ్వతం= శాశ్వతమ్మైన, పదం= పదమును, అవాప్నోతి= పొందుచున్నాడు.

సమస్తకర్మలయందును కర్తృత్వభావమును వదలి, ఆయాకర్మల ఫలరూపమ్మైన సమస్తభోగములను త్యజించి, నన్నే ఆశ్రయించిన కర్మయోగి కర్మలను అన్నింటిని సర్వదాచేయుచును నాకృప సనాతనమ్మైన శాశ్వతమ్మైన మోక్షమును పొందుచున్నాడు.

57 చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।

బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ ॥

చేతసా–సర్వకర్మాణి–మయి–సంన్యస్య–మత్పరః

బుద్ధియోగం- ఉపాశ్రిత్య-మచ్చిత్తః-సతతం-భవ

చేతసా=మనస్సుచేత, సర్వకర్మాణి= సర్వకర్మలను, మయి= నాయందు, సంన్యస్య= ఉంచి, మత్పరః= మత్పరాయణుడై, బుద్ధియోగం= బుద్ధియోగమును, ఉపాశ్రిత్య= అవలంబించి, సతతం= ఎల్లప్పుడును, మచ్చిత్తః= నాయందు చిత్తము గలవాడవు, భవ= కమ్ము.

సర్వకర్మలను మనసా, వాచా, కర్మణా నాకే అర్పించి, సమబుద్ధి రూపయోగమును అవలంబించి, మత్పరాయణుడవై సంతతము చిత్తమును నాయందే గలవాడవు కమ్ము.

58 మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి ।

అథ చేత్ త్వమహంకారాత్ న శ్రోష్యసి వినక్ష్యసి ॥

మచ్చిత్తః-సర్వదుర్గాణి-మత్ప్రసాదాత్=తరిష్యసి

అథ-చేత్-త్వం-అహంకారాత్-న-శ్రోష్యసి-వినక్ష్యసి

మచ్చిత్తః=నాయందు చిత్తముగలవాడవై, మత్ప్రసాదాత్= నా అనుగ్రహమువలన, సర్వదుర్గాణి= సర్వసంకటములను, తరిష్యసి= దాటగలవు, అథ= ఒకవేళ, త్వం= నీవు, అహంకారాత్= అహంకారమువలన, న శ్రోష్యసి చేత్= వినజాలనిచో, వినక్ష్యసి= నశించిపోయెదవు.

పైన తెలుపబడిన విధముగా నాయందు చిత్తమును నిల్పినచో, నా కృపవలన సమస్త కష్టముల నుండియు సునాయాసముగా బయట పడగలవు. ఒకవేళ అహంకార కారణమున నా వచనములను పెడచెవిన బెట్టినచో చెడిపోవుదువు.

59 యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే ।

మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి ॥

యత్-అహంకారం- ఆశ్రిత్య-న-యోత్స్యే- ఇతి-మన్యసే

మిథ్యా- ఏషః-వ్యవసాయః-తే-ప్రకృతిః-త్వాం- నియోక్ష్యతి

యత్ అహంకారం= ఏ అహంకారమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, న యోత్స్యే ఇతి = యుద్ధము చేయనని, మన్యసే= తలచుచున్నావో, తే= నీయొక్క, ఏషః= ఈ, వ్యవసాయః= ప్రయత్నము, మిథ్యా= వ్యర్థము, త్వాం= నిన్ను, ప్రకృతిః= స్వభావము, నియోక్ష్యతి = నియోగింపగలదు.

అహంకారంతో నేను ఈ యుద్ధమును చేయను అని నీవు నిశ్చయించు కొనుట వృథా, నీ స్వభావమే నీ చేత ఆపని చేయించును.

60 స్వభావజేన కౌంతేయ నిబద్ధః స్వేన కర్మణా ।

కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోఽపి తత్ ॥

స్వభావజేన-కౌంతేయ-నిబద్ధః-స్వేన-కర్మణా

కర్తుం-న- ఇచ్ఛసి-యత్-మోహాత్-కరిష్యసి-అవశః-అపి-తత్

కౌంతేయ= అర్జునా, యత్=దేనిని, కర్తుం= చేయుటకు, మోహాత్= మోహము వలన, న ఇచ్ఛసి= ఇచ్ఛగింపవో, తత్= దానిని, స్వభావజేన= స్వభావసిద్ధమైన, స్వేన=నీదైన, కర్మణా= కర్మచేత, నిబద్ధః= బంధింపబడినవాడవై, అవశః అపి= పరవశుడవై కూడా, కరిష్యసి= చేయుదువు.

ఓ కౌంతేయా! మోహము వలన నీవు చేయుటకు ఇష్టపడని కర్మను గూడ నీ పురాకృత స్వాభావిక కర్మలచే బంధింపబడి, తత్ప్రభావమున నీవు పరవశుడవై చేస్తావు.

61 ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।

భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥

ఈశ్వరః-సర్వభూతానాం-హృద్దేశే-అర్జున-తిష్ఠతి

భ్రామయన్–సర్వభూతాని–యంత్రారూఢాని–మాయయా

అర్జున=అర్జునా, ఈశ్వరః= ఈశ్వరుడు, యంత్రారూఢాని= యంత్రము నధిష్టించిన వారివలె, సర్వభూతాని= సమస్త ప్రాణులను, మాయయా= మాయాశక్తిచేత, భ్రామయన్= త్రిప్పుచు, సర్వభూతానాం= సమస్తప్రాణుల యొక్క, హృద్దేశే=హృదయ ప్రదేశమునందు, తిష్ఠతి= ఉన్నాడు.

అర్జునా! శరీరరూపయంత్రములను అధిరోహించిన సర్వప్రాణుల హృదయములయందు అంతర్యామిగానున్న పరమేశ్వరుడు తన మాయచేత వారి వారి కర్మలను అనుసరించి, వారి హృదయములలో వెలుగుచున్నాడు.

62 తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।

తత్ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥

తం– ఏవ– శరణం–గచ్ఛ–సర్వభావేన– భారత

తత్ప్రసాదాత్–పరాం–శాంతిం–స్థానం–ప్రాప్స్యసి–శాశ్వతం

భారత= అర్జునా, సర్వభావేన= సర్వభావములచేత, తం ఏవ = అట్టి పరమేశ్వరునే, శరణం= శరణు, గచ్ఛ= పొందుము, తత్ప్రసాదాత్= అతని అనుగ్రహము వలన, పరాం= ఉత్తమమైన, శాంతిః= శాంతిని, శాశ్వతం= శాశ్వతమైన, స్థానం= మోక్షమును, ప్రాప్స్యసి= పొందగలవు.

అర్జునా ! అన్ని విధములుగా ఆ పరమేశ్వరునే శరణుకోరుము. అతని కృపచేతనే పరమశాంతిని, శాశ్వతమైన మోక్షమును పొందగలవు.

63 ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।

విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥

ఇతి–తే–జ్ఞానం– ఆఖ్యాతం–గుహ్యాత్– గుహ్యతరం–మయా

విమృశ్య- ఏతత్-అశేషేణ-యథా- ఇచ్ఛసి-తథా-కురు

ఇతి= ఇట్లు, గుహ్యాత్ = గుహ్యమైన దానికంటెను, గుహ్యతరం= రహస్యమైన, జ్ఞానం= జ్ఞానము, మయా= నా చేత, తే= నీ కొరకు, ఆఖ్యాతం= చెప్పబడినది, ఏతత్= దీనిని, అశేషేణ = పూర్తిగ, విమృశ్య= విచారణచేసి, యథా= ఏ విధముగ, ఇచ్ఛసి= అభిలషింతువో, తథా= అలాగున, కురు= చేయుము.

ఈ మాదిరిగా అతి రహస్యమైన జ్ఞానమును నేను నీకు తెలియజేసితిని. ఇప్పుడు నీవు ఈ పరమగోప్యమైన జ్ఞానమును పూర్తిగా గ్రహించి, నీకు తోచినటుల చేయుము.

64 సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః ।

ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్॥

సర్వగుహ్యతమం-భూయః-శృణు-మే-పరమం-వచః

ఇష్టః-అసి-మే-దృఢం- ఇతి-తతః-వక్ష్యామి-తే-హితం

భూయః= మరల, సర్వగుహ్యతమం= పరమ రహస్యమైనదియు, పరమం= ఉత్తమమ్మైనదియు నగు, మే= నాయొక్క, వచః= వాక్కును, శృణు= వినుము, మే=నాకు, దృఢం= నిశ్చయముగ, ఇష్టః= ఇష్టుడవు, అసి ఇతి = అయి యున్నావని, తతః= అందువలన, తే= నీ కొరకు, హితం= హితమును, వక్ష్యామి= చెప్పుచున్నాను.

సమస్త గోప్య విషయములయందును పరమఅహస్యమైన నావచనములను మఱొక్కసారి వినుము. నీవు నాకు అత్యంతప్రీతిపాత్రుడవు అగుటవలన నీ మేలు కోరి చెప్పుచున్నాను.

65 మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।

మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ।।

మన్మనాః-భవ-మద్భక్తః-మద్యాజీ-మాం-నమస్కురు

మాం–ఏవ– ఏష్యసి–సత్యం–తే–ప్రతిజానే–ప్రియః–అసి–మే

మన్మనాః=నాయందుమనస్సు కలవాడవు, మద్భక్తః= నాయందు భక్తి కలవాడవు, మద్యాజీ = నన్ను అర్చించువాడవు, భవ= కమ్ము, మాం=నన్ను, నమస్కురు = నమస్కరింపుము, మాం ఏవ = నన్నే, ఏష్యసి= పొందగలవు, మే= నాకు, ప్రియః= ఇష్టుడవు, అసి= అయియున్నావు, తే=నీకు, సత్యం= సత్యమును, ప్రతిజానే= ప్రతిజ్ఞచేసి చెబుతున్నాను.

ఓ అర్జునా ! నీవు నాయందే మనస్సునుంచుము. నా భక్తుడవు కమ్ము. నన్నే సేవింపుము. నాకు ప్రణమిల్లుము. ఇట్లు చేయుటవలన నన్నే పొందగలవు. అది ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను.

66 సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।

అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥

సర్వధర్మాణ పరిత్యజ్య–మాం– ఏకం– శరణం–వ్రజ

అహం–త్వా–సర్వపాపేభ్యః–మోక్షయిష్యామి–మా–శుచః

సర్వధర్మాన్=సమస్తధర్మములను, పరిత్యజ్య= విడిచిపెట్టి, మాం= నన్ను, ఏకం= ఒక్కనినే, శరణం= శరణమును, వ్రజ= పొందుము, అహం=నేను, త్వా=నిన్ను, సర్వపాపేభ్యః= సకలపాపములనుండి, మోక్షయిష్యామి= విడిపించెదను, మా శుచః= శోకింపకుము.

సర్వధర్మములను అనగా సమస్తకర్తవ్యకర్మలను నాకు సమర్పింపుము. సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను పరమేశ్వరుడను ఐన నన్నే శరణుజొచ్చుము. అన్ని పాపములనుండియు నిన్ను నేను విముక్తుని గావించెదను. నీవు శోకింపవలదు.

67 ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।

న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥

ఇదం–తే–న–అతపస్కాయ–న–అభక్తాయ–కదాచన

న–చ–అశుశ్రూషవే–వాచ్యం–న–చ–మాం–యః–అభ్యసూయతి

తే=నీకొరకు, ఇదం= ఈ బోధ, కదాచన= ఒకప్పుడును, అతపస్కాయ= తపస్విగానివానికి, న వాచ్యం= ఉపదేశింపదగదు, అభక్తాయ= భక్తుడుగాని వానికి, అశుశ్రూషవే చ= శుశ్రూషచేయనివానికి, న వాచ్యం= చెప్పదగదు, యః= ఎవడు, మాం=నన్ను, అభ్యసూయతి చ=ద్వేషించుచున్నాడో, న వాచ్యం= చెప్పుగూడదు.

తపస్సంపన్నుడు కానివానికిని, భక్తిరహితునకును, నన్ను ద్వేషించువానికి నీవు ఈ గీతారూపరహస్యోపదేశమును ఎన్నడునూ చెప్పరాదు.

68 య ఇదం పరమం గుహ్యం మద్భక్తేష్వభిదాస్యతి ।

భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః ॥

యః– ఇమం–పరమం–గుహ్యం–మద్భక్తేషు–అభిదాస్యతి

భక్తిం–మయి–పరాం–కృత్వా–మాం– ఏవ– ఏష్యతి–అసంశయః

యః= ఎవడు, పరమం= పరమమ్మైన, గుహ్యం= గుహ్యమ్మైనటువంటి, ఇమం= దీనిని, మద్భక్తేషు= నా భక్తులయందు, అభిదాస్యతి= చెప్పునో, సః=వాడు, మయి= నాయందు, పరాం= ఉత్తమమ్మైన, భక్తిం= భక్తిని, కృత్వా= చేసి, అసంశయః= సంశయరహితుడై, మాం ఏవ= నన్నే, ఏష్యతి= పొందగలడు.

నా యందు పరమభక్తి గలిగి, ఈ పరమగోప్యమ్మైన గీతోపదేశమును అనగా గీతాశాస్త్రమును
నా భక్తుల మదిలో పదిలపఱచువాడు నన్నే పొందగలడు. ఇందేమాత్రమూ సందేహము లేదు.

69 న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।

భవితా న చ మే తస్మాత్ అన్యః ప్రియతరో భువి ॥

న–చ–తస్మాత్–మనుష్యేషు–కశ్చిత్–మే–ప్రియకృత్తమః

భవితా–న–చ–మే–తస్మాత్–అన్యః–ప్రియతరః–భువి

మనుష్యేషు= మనుష్యులయందు, తస్మాత్ = వానికంటెను,మే = నాకు, ప్రియకృత్తమః= మిక్కిలి ఇష్టమొనర్చువాడు, కశ్చిత్= ఒకడును, న చ=లేడు, మే=నాకు, తస్మాత్= వానికంటె, అన్యః= ఇతరుడు, ప్రియతరః= మిగుల ప్రియమ్మైనవాడు, భువి= భూమి యందు, న చ భవితాః= ఉండబోడు.

మనుష్యులలో అతనిని మించిన భక్తుడెవ్వడును లేడు. అంతేగాక అతనివలె గాని, అతనిని మించిగాని నాకు ప్రియమ్మైన వాడు భూమండలమున మరియొకడు భవిష్యత్తులోను ఉండబోడు.

70 అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।

జ్ఞానయజ్ఞేన తేనాహమ్ ఇష్టః స్యామితి మే మతిః ॥

అధ్యేష్యతే–చ–యః– ఇమం–ధర్మ్యం–సంవాదం– ఆవయోః

జ్ఞానయజ్ఞేన–తేన–అహం– ఇష్టః–స్యాం– ఇతి–మే–మతిః

ఆవయోః=మనయొక్క, ధర్మ్యం= ధర్మప్రయోజనమ్మైన, ఇమం= ఈ, సంవాదం= సంవాదమును, యః= ఎవడు, అధ్యేష్యతే చ = చదువ బోవుచున్నాడో, తేన= వానిచేత, జ్ఞానయజ్ఞేన = జ్ఞానయజ్ఞము చేతను, అహం=నేను, ఇష్టః= పూజితుడను, స్యాం= అగుదును, ఇతి=అని, మే=నాయొక్క, మతిః= నిశ్చయము.

ధర్మయుక్తమైన మనసంవాదరూపమైన ఈ గీతాశాస్త్రమును పఠించువాడు జ్ఞానయజ్ఞముద్వారా నన్ను పూజించువాడని నా ఉద్దేశ్యము.

71 శ్రద్ధా వాననసూయశ్చ శృణుయాదపి యో నరః ।

సోఽపి ముక్తః శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్ పుణ్యకర్మణామ్।

శ్రద్ధావాన్-అనసూయః-చ-శృణుయాత్-అపి-యః-నరః

సః-అపి-ముక్తః-శుభాన్-లోకాన్-ప్రాప్నుయాత్-పుణ్యకర్మణాం

యః= ఏ, నరః=నరుడు, శ్రద్ధావాన్=శ్రద్ధావంతుడును, అనసూయః చ= అసూయ లేనివాడునునై,శృణుయాత్ అపి= ఆలకించునో, సః అపి= వాడును, ముక్తః= ముక్తుడై, పుణ్యకర్మణాం= పుణ్యకర్మల యొక్క, శుభాన్= శుభకరమైన, లోకాన్= లోకములను, ప్రాప్నుయాత్= పొందును.

శ్రద్ధాదరములుగలవాడును, దోషదృష్టి లేనివాడును ఐన మనుష్యుడు గీతాజ్ఞానమును వినుటవలనగూడ పాపవిముక్తుడై, పుణ్యకర్మలను ఆచరించువారుపొందు ఉత్తమలోకములను పొందుచున్నాడు.

72 కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।

కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ ॥

కచ్చిత్- ఏతత్-శ్రుతం-పార్థ-త్వయా- ఏకాగ్రేణ-చేతసా

కచ్చిత్-అజ్ఞానసమ్మోహః-ప్రనష్టః-తే-ధనంజయ

పార్థ=అర్జునా, ఏతత్ = ఇది, త్వయా= నీచేత, ఏకాగ్రేణ = నిశ్చలమైన, చేతసా= మనస్సుతో, శ్రుతం కచ్చిత్= శ్రవణము చేయబడినది గదా, ధనంజయ= అర్జునా, తే=నీయొక్క, అజ్ఞానసమ్మోహః= అజ్ఞానమువలన కలిగిన మోహము, ప్రనష్టః కచ్చిత్= పోయినదిగదా.

అర్జునా ! ఈ గీతాశాస్త్రమును నీవు ఏకాగ్రచిత్తముతోవింటివా ? ఓ ధనంజయా ! అజ్ఞానజనితమైన నీ మోహము నశించినదా ?

అర్జున ఉవాచ

73 నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।

స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥

నష్టః-మోహః-స్మృతిః-లబ్ధాః-త్వత్ప్రసాదాత్-మయా-అచ్యుత

స్థితః-అస్మి-గతసందేహః-కరిష్యే-వచనం-తవ

అచ్యుత=కృష్ణా, త్వత్ప్రసాదాత్ = నీ అనుగ్రహమువలన, మోహః= మోహము, నష్టః= నశించినది, మయా=నా చేత, స్మృతిః= స్మృతి, లబ్ధా= పొందబడినది, గతసందేహః= సందేహములు తొలగి, స్థితః= ఉన్నవాడను, అస్మి= అగుచున్నాను, తవ= నీయొక్క, వచనం= ఆజ్ఞను, కరిష్యే= ఆచరింతును.

అర్జునుడు పలికెను - ఓ అచ్యుతా ! నీ కృపచే నా మోహము పూర్తిగా తొలగినది. జ్ఞానము పొందితిని.ఇప్పుడు సంశయరహితుడనైతిని.కనుక నీఆజ్ఞను ఆచరించెదను.

సంజయ ఉవాచ

74 ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।

సంవాదమిమమశ్రౌషమ్ అద్భుతం రోమహర్షణమ్ ॥

ఇతి-అహం-వాసుదేవస్య-పార్థస్య-చ-మహాత్మనః

సంవాదం- ఇమం-అశ్రౌషం-అద్భుతం-రోమహర్షణం

అహం=నేను, ఇతి= ఇట్లు, వాసుదేవస్య= శ్రీకృష్ణుని యొక్కయు, మహాత్మనః= మహాత్ముడగు, పార్థస్య చ= పార్థునియొక్కయు, అద్భుతం= అద్భుతమైనదియు,

రోమహర్షణం= గగుర్పాటును కలిగించునదియు నగు, ఇమం= ఈ, సంవాదం= సంవాదమును , అశ్రౌషం= వింటిని.

సంజయుడు పలికెను - ఈ విధముగా శ్రీ వాసుదేవునకును మహాత్ముడైన అర్జునకును మధ్య జరిగిన సంవాదమును వింటిని. అది ఆశ్చర్యకరమైనది, గగుర్పాటు కలిగించుచున్నది.

75 వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్ ఏతద్గుహ్యతమ పరమ్ ।

యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్ సాక్షాత్ కథయతః స్వయమ్ ॥

వ్యాసప్రసాదాత్-శ్రుతవాన్- ఏతత్-గుహ్యం-అహం-పరం

యోగం-యోగేశ్వరాత్-కృష్ణాత్-సాక్షాత్-కథయతః-స్వయం

వ్యాసప్రసాదాత్= వ్యాసభగవానుని అనుగ్రహమువలన, గుహ్యం= గుహ్యమైనదియు, పరం= ఉత్తమమైనదియునగు, ఏతత్= ఈ, యోగం= యోగమును, స్వయం= స్వయముగ, కథయతః= చెప్పినటువంటి, యోగేశ్వరాత్= యోగేశ్వరుడైనట్టి, కృష్ణాత్= శ్రీకృష్ణునివలన, అహం= నేను, సాక్షాత్= ప్రత్యక్షముగ, శ్రుతవాన్= వినినవాడనైతిని.

వేదవ్యాసునికృపవలన దివ్యదృష్టిని పొందినవాడనై, పరమరహస్యమైన ఈ యోగమును యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు చెప్పుచుండగా నేను ప్రత్యక్షముగా వినగలిగాను.

76 రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమ్ ఇమమద్భుతమ్ ।

కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః ॥

రాజన్-సంస్మృత్య-సంస్మృత్య-సంవాదం- ఇమం-అద్భుతం

కేశవార్జునయోః-పుణ్యం-హృష్యామి-చ-ముహుర్ముహుః

రాజన్=రాజా, పుణ్యం= పుణ్యకరమ్మైన, ఇమం= ఈ, అద్భుతం= ఆశ్చర్యకరమ్మైన, కేశవార్జునయోః= కృష్ణార్జునులయొుక్క, సంవాదం= సంవాదమును, సంస్మృత్య సంస్మృత్య= తలచితలచి, ముహుర్ముహుః= మాటిమాటికిని, హృష్యామి చ= సంతసించుచున్నాము.

ఓ రాజా ! శ్రీ కృష్ణభగవానునకును అర్జునునకును మధ్య జరిగిన రహస్యమ్మైన ఈ సంవాదము అతి పుణ్యప్రదమ్మైనది. అత్యద్భుతమ్మైన ఈ సంవాదమును అనుక్షణము పదేపదే స్మరించుచు నేను పరవశించిపోతున్నాను.

77 తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః ।

విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునఃపునః ॥

తత్–చ–సంస్మృత్య–సంస్మృత్య–రూపం–అతి–అద్భుతం–హరేః

విస్మయః–మే–మహాన్–రాజన్–హృష్యామి–చ–పునః–పునః

రాజన్=రాజా, హరేః= శ్రీకృష్ణునియొుక్క, అత్యద్భుతం= మిక్కిలి అద్భుతమ్మైన, తత్= ఆ, రూపం చ = రూపమును, సంస్మృత్య= తలచి తలచి, మే=నాకు, మహాన్= గొప్ప, విస్మయః= ఆశ్చర్యము కలుగుచున్నది, పునః పునః చ= మరల మరల, హృష్యామి చ= సంతసించుచున్నాను.

ఓ రాజా !అత్యంత విలక్షణము, పరమాద్భుతము, అపూర్వము ఐన ఆ శ్రీహరిరూపమును పదేపదే స్మరించుచు, నేను పొందుచున్న సంభ్రమాశ్చర్య ములకు హద్దు లేదు. తత్ప్రభావమున మఱలమఱల సంతోషము కలుగుతోంది.

78 యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।

తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ ॥

యత్ర–యోగేశ్వరః–కృష్ణ–యత్ర–పార్థః–ధనుర్ధరః

తత్ర–శ్రీః–విజయః–భూతిః–ధ్రువా–నీతిః–మతిః–మమ

యత్ర= ఎచ్చట, యోగేశ్వరః= యోగేశ్వరుడగు, కృష్ణః= శ్రీకృష్ణుడు, యత్ర= ఎచ్చట, ధనుర్ధరః= ధనుస్సును ధరించిన, పార్థః= అర్జునుడు, తత్ర= అచ్చట, శ్రీః= లక్ష్మియు, విజయః= విజయము, భూతిః= ఐశ్వర్యము, ధ్రువా= స్థిరమగు, నీతిః= నీతియు, ఇతి=అని, మమ=నాయొక్క, మతిః= అభిప్రాయము.

ఎక్కడ యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడును, గాండీవధనుర్ధారియైన అర్జునుడును ఉండునో అక్కడ సంపదలును, సర్వవిజయములును, సకలైశ్వర్యములును, సుస్థిరమైన నీతియు ఉండును.

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు

బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే

మోక్షసన్న్యాసయోగోనామ

అష్టాదశోఽధ్యాయః ॥